


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 9 | ఫిబ్రవరి, 2013 | సంచిక : 9

(నందన నామ సం॥, ఫాల్గుణ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం .......... | రూ॥ | 600/- |



**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com


**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి .................................... 2

అనుభవ సత్యాలు .................................... 8

మంగళాశీస్సులు .................................... 9

ఎవరనుకున్నావు? .................................... 11

శ్రీ సాయి సేవ .................................... 13

ఒక యోగి ఆత్మకథలో.................................... 16

మాతృసంస్థ కబుర్లు .................................... 18

మేఘశ్యామ్-ఆధ్యాత్మికత .................................... 25

బాలవాణి .................................... 29

షిరిడీ (కపర్దే) డైరీ .................................... 31








# మా వాణి



మాఘ శుక్ల సప్తమి రథసప్తమి. (ఈసారి ఫిబ్రవరి 17న వస్తోంది). సప్తాశ్వరథారూఢుడైన సూర్యుని పూజించటం ఆనాటి విశేషం. అనాది కాలంగా సూర్యపూజ, స్తుతి మన దేశంలో ఆచారంగా ఉన్నది. శ్రీమన్నారాయణుని రూపాలలో సూర్య నారాయణ మూర్తి కూడా ఒకటిగా భావిస్తారు. సూర్యుడు తేజోమూర్తి. స్వయంప్రకాశకుడు-అంటే తనపై ఎవరి ప్రభావమూ లేకుండా తనంతటతానే ప్రకాశించగలడు-అందుకే ఆయనను ప్రభాకరుడు, భాస్కరుడు-(కాంతివంతమైన కిరణాలు కలవాడు) అంటారు. ఆయన వెలుగులోనే మనం మన కార్యకలాపాలన్నీ చేసుకోగలం. అలాంటి 'పగలు' ఆయన వలననే తయారవుతుంది గనుక దినకరుడు, దివాకరుడు, అహస్కరుడు వంటి పేర్లు వచ్చాయి. తీవ్రకాంతిని చిందుతాడు గనుక తపనుడు, ఖరకరుడు, వేలాది కిరణాలున్నవాడు గనుక సహస్ర కిరణుడు ఇంకా రవి, తరణి, పూష్ణుడు యిలా ఎన్నెన్నో పేర్లున్నాయి సూర్యునికి. అన్నిటినీ మించినది 'కర్మసాక్షి' అన్నది. సూర్యుని వెలుగు తిన్నగాగానీ, పరోక్షంగాగానీ రోజంతా ఎక్కడో ఒకచోట ప్రసరిస్తూనే ఉంటుంది. అందుచేత మనం చేసే ప్రతి పనికీ (కర్మకూ) సాక్షిగా నిలిచేవాడు ఆయనే నట. అలాంటి సూర్యభగవానుని శక్తిని గూర్చిన జ్ఞానం భారతీయులకు ఎప్పటినుంచీ ఉంది? అబ్బో! అనంతయుగాల నుండీ ఉంది.

రామాయణ కాలంలో శ్రీరామ రావణులకు యుద్ధం జరుగుతున్న సమయంలో అగస్త్య మహర్షుల వారు రామునికి 'ఆదిత్య హృదయం' అనే పరమశక్తివంతమైన స్తోత్రాన్ని అనుగ్రహించారని ఉన్నది. అది నేటికీ నిత్యపారాయణగా చేసేవారు అనేకులున్నారు. అనుదిన సూర్య

నమస్కారాలు చేయటం, రాష్ట్రంలో వేలాదిమందికేమిటి-యీ దేశంలో లక్షలాదిమందికి నిత్యకృత్యంగా వస్తున్నది. నదులు, కాలవలు, చెరువులలో మునిగి స్నానాదికాలు పూర్తి చేసుకొని, సూర్యునికి అర్ఘ్యం సమర్పించి, అటుపైన సంధ్యావందనాదికాలు నిర్వర్తించుకోవటం హిందువులకు సంప్రదాయం. కాకపోతే ఆదికాలంలో అందరూ చేసిన యీ పావన క్రియాకలాపాలు కాలగతిలో కొందరికే పరిమితం కావటం దురదృష్టం. విభిన్న కులవృత్తులు ఆచరించే వారికి నిత్యం స్నానాదికాలు వేకువనే కుదరకపోవటం, క్రమక్రమంగా అందరికీ ఆధ్యాత్మిక విద్య అక్కరలేదన్న ఒక భావన ప్రబలిపోవటం, ఇంకా కొంతకాలానికి స్వార్థపరులైన కొందరు తమకు, ఆ స్థాయిలోని వారికి తప్ప - మిగిలిన వారికి ఇవన్నీ పనికిరావని నిషేధించటం-అలా అలా ఏ కొద్దిమందికో తప్ప సూర్యోపాసన, సంధ్యా వందనాదికాలు చాలామందికి దూరమైపోయాయి. కానీ, వేకువజామునే లేచి కవ్వానికి తాడు కట్టి మజ్జిగ చిలికే తల్లులు, ముంగిళ్లలో ముగ్గులు తీర్చే కన్నెపిల్లలు, చెరువుల్లో నీళ్లు ముంచుకొచ్చే మహిళలు-అందరూ కూడా సూరీడుకి మేలుకొలుపులు పాడేవారు.

పొడుస్తు బాలుడు పొన్నపువ్వూ చాయ
పొన్నపువ్వూ మీద పగడంపు పూచాయ
శ్రీ సూర్యనారాయణా మేలుకో
హరి సూర్యనారాయణా మేలుకో॥ ............ అని ప్రారంభించి -
గ్రుంకుతూ బాలుడూ కుంకుమాపువు చాయ
కుంకుమాపువు మీద కుందనపు పొడి చాయ
శ్రీ సూర్యనారాయణ మేలుకో
హరి సూర్యనారాయణా మేలుకో ॥ అని ఉదయం, జామెక్కటం, మధ్యాహ్నం, సాయంత్రం, అస్తమయం - ఆయా వేళలలో సూర్యుని వన్నెలు ఎలా ఉంటాయో ఎంత అద్భుతంగా, మనోహరంగా వర్ణించే వారంటే - 'ఆ రంగుల మేళవింపు లోకాతీతుడైన చిత్రకారుడిదే సుమా' అన్నట్లుండేవి





పాటలు.

సూర్యుడిని చూడనిదే భోజనం చెయ్యకూడదన్న నియమం కూడా కొందరికి ఉండేది గతంలో. ఇది సూర్యుడిని దైవంగా భావించటం వలననే కాదు. ఇందులో ఒక ఆరోగ్య రహస్యం కూడా ఉంది. అసలు సూర్యోపాసనకు మూలమే మన ఋషులకున్న ఆయుర్వేద పరిజ్ఞానం. సూర్యకాంతి అనేకరకాల సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది. చర్మరోగాలను పరిహారం చేస్తుంది. (ఉతికిన బట్టలు బాగా ఎండలో ఎండినపుడు మరకలు తగ్గటం చూడటం లేదూ మనం! ఇదీ అంతే). 'డి' విటమిన్ పుష్కలంగా ప్రసాదిస్తుంది. (ఎప్పుడూ ఎ.సి. గదులలో కాలక్షేపం చేస్తున్న వారు 'డి' లోపంతో బాధపడుతున్నారనీ, మార్నింగ్ వాక్ చేసేవారు కూడా ఎండ తగిలేలాగా చేయటం మంచిదనీ యీ మధ్యనే డాక్టర్లు ఒక సెమినార్‌లో చెప్పారు కూడా.) మన ఆకలి, ఆహారం తీసుకోవటం, ఎండ - యీ మూడింటికీ సంబంధం ఉంది. ఉదయం సూర్యోదయంతో ఆకలి ప్రారంభమై, మధ్యాహ్నం సూర్యుడు నడినెత్తికి వచ్చేటప్పటికి బాగా కరకరలాడాలి. సాయంత్రం ఆరింటి నుంచీ తగ్గిపోవాలి. అందుకే ఉదయ భోజనం యువరాజులాగా (తేలికగా), మధ్యాహ్న భోజనం మహరాజులాగా (సుష్టుగా), యామినీ (రాత్రి) భోజనం యాచకుడిలాగా (అల్పంగా) చేయాలని పెద్దలు చెప్పారు. యోగాసనాలలో అత్యంత ప్రశస్తమైనవి సూర్య నమస్కారాలు. సూర్యనామాలను మంత్రాలుగా ఉచ్చరిస్తూ చేసే యీ నమస్కారాలు శరీరంలోని మూడు వంతుల కండరాలను కదిలించి గట్టిబరుస్తాయనీ, రక్తప్రసరణను సక్రమం చేస్తాయనీ, వెన్నెముకను పరిపుష్టం చేస్తాయనీ, ఆ శాస్త్రం తెలిసినవారు చెప్తారు. ఇన్నివిధాల సూర్యుడితో అనుబంధం ఉన్నది మన ఆరోగ్యానికీ, ఆహారానికీను.

అసలు ఆహారోత్పత్తికీ, జీవుల మనుగడకూ అవసరమైన వర్షం రావడానికి కూడా సూర్యుడే మౌలికశక్తి. సూర్యశక్తితో ఆవిరి రూపాన్ని ధరించి మేఘాలైన సాగరజలమే మనకు వర్షరూపంలో అంది, మనకు

జీవనప్రదాత అవుతోంది గదా! సూర్యకాంతి లేనిదే (ఆకులు ఆహారం తయారుచేసుకోవడానికి) మొక్కలు బ్రతకలేవు. మొక్కలు, చెట్లు, పంటలు లేనిదే జీవరాశికి-పశుపక్ష్యాదులకు, మానవాళికి కూడా బ్రతుకు నిలవదు. అంటే సూర్యుడు లేనిదే సృష్టే లేదు. అందుకే సతీ సుమతి తన భర్త ప్రాణాలు కాపాడుకోవటానికి సూర్యోదయాన్ని ఆపినపుడు సాక్షాత్తు మహాపతివ్రత అనసూయాదేవి అంతటి (శ్రీ దత్త మాత) తల్లే రంగంలోకి దిగి, సుమతికి నచ్చజెప్పి, సూర్యోదయం అయ్యేలా చేయించి, తదుపరి సుమతి భర్తను రక్షించవలసి వచ్చింది. సూర్యుని శక్తి ఆదివారంనాడు (ఆదిత్య వారం అది-ఆంగ్లంలో కూడా సన్ (సూర్యుని)డే! చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ రోజు శరీరం వీలైనంత పరిశుద్ధంగా ఉంచుకోవాలనీ, తద్వారా సూర్యుని అనుగ్రహానికి పాత్రులం కాగలమనీ అంటుంది ఆయుర్వేదం. ఆదివారంనాడు వేడిని కలిగించే పదార్థాలు ఏవీ తిన కూడదు. అందుకే అమృతఫలమని పేరు పొందినాగానీ ఉసిరికాయను ఆ రోజు తినకూడదు. తాకనైనా తాకరాదని గ్రామీణుల విశ్వాసం. మహాభారతంలోని అనుశాసనపర్వంలో ఒక అద్భుతమైన విషయం చెప్పారు వ్యాసులవారు. ఆదివారంనాడు మత్స్యమాంసాలుగానీ, సారాయి వగైరాలుగానీ తినరాదు, త్రాగరాదు. పైగా ఆరోజు బ్రహ్మచర్యం పాటించి, స్త్రీకి దూరంగా ఉండాలి. ఇది శాసనంగా తీసుకోవలసిన ఆర్యోక్తి కానీ, వందలాది ఏళ్లుగా పరిపాలనలో ఉన్న మన బుద్ధి బానిసజాడ్యం వదిలించుకోలేకపోతోంది. అంచేత ఆదివారమే సెలవుంటుంది. ఆ రోజు అందరూ ఇంట్లో ఉంటారు. అంచేత తాపీగా, ఫ్రీగా నానారకాలూ వండి ఆరగించటం, మందు పార్టీలు, ఇంకా యింకా ........ అటుపైన అంతుచిక్కని రోగాలు. మనం చేతులారా కోరి తెచ్చికొంటున్న దౌర్భాగ్యం యిది. ఈ విషయం జాగ్రత్తగా ఆలోచించి మనం పాటిస్తే ఎంతో మేలు కలుగుతుంది. హైందవజాతి క్రమంగా నిర్వీర్యమైపోవడానికి ఉన్న కారణాలలో సూర్యోపాసన మర్చిపోవటం, ఆదివారం నిషిద్ధాలను స్వీకరించటం కూడా





ఉన్నాయి.

సూర్యుడు మహాపండితుడు, గొప్ప వ్యాకరణవేత్తాను. హనుమంతుడు సూర్యుని గురుత్వంలో విద్య నేర్చినవాడే. శ్రీరాముని కూడా మెప్పించగలిగిన మాట తీరు, మన్నన, దీక్ష - యివన్నీ సూర్యసేవ వలన అబ్బినవే. అసలు సూర్యుడు ఒక్కడు కాదు. పన్నిద్దరు(12) సూర్యులున్నారు, వారినే ద్వాదశాదిత్యులంటారు సంస్కృతంలో. ప్రపంచంలో అధర్మం పెచ్చు పెరిగిపోయి, భ్రష్టత్వంలో కూరుకుపోతున్నప్పడు-ఒకేసారి ఈ పన్నెండు మంది సూర్యులూ తమ ఖరకిరణాలతో సాగరజలాన్ని మొత్తం పీల్చేస్తారనీ, ఫలితంగా ఏర్పడిన మేఘపంక్తులు ఎడతెగని వర్షాలు కురిపిస్తాయనీ, దాని వలన జలప్రళయం ఏర్పడి ప్రపంచ వినాశనం జరుగుతుందనీ భారతీయుల విశ్వాసం.

సూర్యుని ప్రతిభను చెప్పే ఒక శ్లోకం సంస్కృతంలో ఉంది.

"రథస్యైకం చక్రం భుజగయమితాః సప్తతురగాః
నిరాలంబోమార్గః చరణవికలో సారథిరపి ।
రవిర్యాత్యేవాంతం ప్రతిదినమపారస్య నభసః
క్రియాసిద్ధిస్సత్వే వసతి మహతాం నోపకరణే

సూర్యుని రథానికి చక్రం ఒక్కటే ఉంటుంది. ఇది కాలచక్రానికి గుర్తు. ఒక్క చక్రం మీద రథం నడవటం అసాధ్యం. గుర్రాలు ఏడుంటాయి. అవి సరిసంఖ్యలో ఉంటే రథం నిలకడగా నడుస్తుంది. బేసి సంఖ్యలో ఉండి ఇబ్బంది పెడుతుంటాయి. వాటిని నియంత్రించడానికి యాయన చేతిలో ఉండే పగ్గాలు పాములు. పోనీ, రథసారధైనా శక్తిమంతుడా అంటే కాదు-తొడలే లేని అనూరుడు. తిరగవలసిన చోటేది? త్రోవేలేని శూన్యాకాశం. పోనీ, ఏదో కాస్సేపు తిరిగితే చాలునా? రోజంతా అలా తిరుగుతూ ఉండవలసిందే! అలాంటి ఒంటి చక్రపు రథం మీద మంచి సాధనాలేవీ లేకుండా సూర్యుడు క్రమం తప్పకుండా ఎలా తిరగగలుగుతున్నాడూ అంటే క్రియాసిద్ధిః -పని నెరవేరటం అన్నది కార్యనిర్వాహకుని శక్తి (ఆత్మశక్తి)

మీద ఆధారపడి ఉంటుందిగానీ సాధనాలపైన కాదు సుమా! - అంటాడు కవి. ఇదే మనం సూర్యుని నుంచీ నేర్చుకోవలసిన గొప్ప విషయం. ఆత్మ బలం పెంచుకొంటే ఎంత చిన్నవిగా కనిపించే ఉపకరణాలతోనైనా సరే పని సాధించవచ్చు. మనోస్థైర్యం, బలం లేనప్పుడు ఉపకరణాలెంత గొప్పవైనా గానీ మన లక్ష్యసిద్ధికి పనికిరావు. అందుచేత లోకహితం చేయదలచు కొన్న వారెవ్వరైనా ఆత్మశక్తి పెంచుకోవాలి.

మనకు ఇన్నివిధాలుగా సన్నిహిత దైవం కావటం చేత సూర్య నారాయణమూర్తికి దేవాలయాలు నిర్మించుకొన్నాం. వందల సంవత్సరాల క్రితం నిర్మింపబడిన కోణార్క దాని నిర్మాణరీతికి, శిల్పసంపదకు జగత్ప్రసిద్ధ మైనది. గోదావరిసీమలోని అరసవిల్లి దేవాలయం కూడా అద్వితీయమైన శక్తితో, మంచి పరిసరాలతో, చక్కని మూలవిరాట్ విగ్రహంతో ముచ్చటగా ఉంటుంది. నిత్యపూజలు సాగుతూ ఉంటాయిక్కడ.

సంక్రాంతి నుండీ రథసప్తమి వరకు తెలుగింటి వాకిళ్లలో రథం ముగ్గులు రకరకాల డిజైన్లలో చుక్కలతో, గీతలతో తీర్చిదిద్దుతుంటారు. సంక్రాంతి రోజుల (నెలరోజులు)లో ముంగిళ్లలో పెట్టిన గొబ్బెమ్మలు పిడకలుగా కొట్టి ఎండబెట్టి కొన్ని భోగిమంటల్లో వేసి, మిగిలినవి దాచి ఉంచుతారు. రథసప్తమినాటి వేకువజామున జిల్లేడు ఆకులు-అవి దొరక్క పోతే చిక్కుడాకులు తెస్తారు. ఒంటికి నువ్వులనూనె రాసుకొన్న తరువాత జిల్లేడాకులు శిరస్సున, భుజాలపైన ఉంచుకొని తలంటిపోసుకుంటారు. (జిల్లేడుకు అర్కపత్రం అని పేరున్నది. అర్కుడంటే సూర్యుడు). తలస్నానా లయ్యాక తూర్పువైపున పొయ్యి పెట్టి యీ సంక్రాంతి పిడకలతో దాలిపెట్టి, దాని మీద ఆవుపాలు పొంగించి, క్షీరాన్నం వండుతారు. చిక్కుడు కాయలు, ఆకులతో రథం తయారుచేస్తారు. దాన్ని ముగ్గు మీద ఉంచి చుట్టూ ఏడు చిక్కుడాకులలో క్షీరాన్నం ఉంచి, కొద్ది నెయ్యి చిలకరించి సూర్యునికి నివేదన పెడతారు. అలా రథసప్తమి చేసుకోవటం అనేది భారతదేశం అంతటా ఉంది.

మనం ప్రస్తుతం లాగుతున్న యిరుకుబ్రతుకుల్లో ఆనందారోగ్యాలు కలగటానికి సూర్యుడెంతగా దోహదకారి అవుతాడో, మన నేల పచ్చగా





ఉండటానికి ఆయన ఎంత మూలకారుకుడో ఓసారి గుర్తు చేసుకున్నాక- ఇక యిప్పడు మనం చెయ్యవలసింది ఒక్కటి ఉంది. మనలో చాలామందిమి ఎలాగూ దారితప్పాం. కనీసం మన భావితరం క్షేమాన్నైనా మనం కోరుకోవాలి గదా! ఇకనైనా మనం ఆదివారాలు మధువు, మాంసం, మగువ వంటి వాటిని దూరంగా ఉండటం ప్రారంభిస్తే అది వాళ్లకు మార్గదర్శకం అవుతుంది. అంతేకాక చిన్ననాటనే ఆదిత్యహృదయం నేర్పి, ప్రతిరోజూ ఉదయాన్నే స్నానం చేసి, సూర్యునికి ఎదురుగా నిలబడి ఆదిత్య హృదయం చదివే అలవాటు చేయటం, సూర్య నమస్కారాలు (యోగాలో) చేయించటం చాలా మంచి చేస్తుంది. దానికి యీ రథసప్తమి నాడే అంకురార్పణ చేద్దాం. మనం కూడా అలవరచుకొందాం.

---

# అనుభవ సత్యాలు

**సేకరణ : శ్రీ గోవిందరావు**

డబ్బు జీవితములో ఒక భాగమే కాని డబ్బే జీవితం కాదు.

డబ్బుతో హంసతూలికా తల్పాలను కొనవచ్చు కాని నిద్రను కొనలేము.

డబ్బుతో పంచభక్ష్య పరమాన్నాలను కొనవచ్చుకాని ఆకలిని కొనలేము.

డబ్బుతో ఔషధాలను కొనవచ్చు. కాని ఆరోగ్యాన్ని కొనలేము.

డబ్బుతో పైపై మెరుగులను పొందవచ్చును. కాని సౌందర్యాన్ని కొనలేము.

డబ్బుతో సేవకుల్ని కొనవచ్చు కాని వారి విశ్వాసాన్ని కొనలేము.

డబ్బుతో డిగ్రీలను కొనవచ్చు కాని వివేకాన్ని కొనలేము.

డబ్బుతో శరీరానికి సుఖాన్ని కొనవచ్చు కాని శాంతిని, సంతోషాన్ని కొనలేము.

డబ్బుతో పరిచయాలను పెంచుకోవచ్చు, కాని నిజమైన స్నేహితుల్ని (మనను మనసారా ప్రేమించే) వారిని కొనలేము.



# మంగళాశీస్సులు



శ్రీమతి పద్మావతి, శ్రీ కాకరపర్తి వెంకటరత్నంగారలు సాయిధామానికి అభిమానులు. వారు తమ పెద్ద కుమారుడు చి॥ శ్రీనివాస చైతన్యకు చి.ల.సౌ. ప్రీతితో కళ్యాణక్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని తాజ్ త్రిస్టార్ 08-12-2012 నాటి రాత్రి గం.8.50 ని.లకు పెద్దల సమక్షంలో జీవితాలు ముడివేసుకున్న నవదంపతులు పరస్పరానురాగంతో జీవించి, సత్సంతానాన్ని దేశమాత సేవకు అనుగుణంగా పెంచి ధన్యులు కావలసిందిగా పరమపూజ్య గురుదేవులు మంగళాశీస్సులు, సాయివాణి శుభకామనలున్నూ అందిస్తున్నారు.

శ్రీమతి బొమ్మారెడ్డి ఇందిర, శ్రీ రవీంద్రరెడ్డి గారలు సాయిధామంతో చిరకాలంగా గాఢమైన అనుబంధం ఉన్నవారు. చక్కని విద్యాలయం నడుపుతూ విద్యాసేవ చేస్తున్నారు. మంచి దాతృత్వం, సేవాభావం, ఆధ్యాత్మిక చింతన ముప్పేటలుగా జీవితాలు మలుచుకొంటున్న యీ దంపతులు తమ ఏకైక కుమార్తె చి.సౌ. రూపాంజలిని శ్రీ మలిరెడ్డి కృష్ణారెడ్డిగారి ఏకమాత్ర పుత్రుడు చి. ఆదిత్య కృష్ణారెడ్డికి ఇచ్చి డిసెంబరు 16వ తేదీన రాత్రి గం.9.04 ని.లకు కూకట్‌పల్లిలోని ఎన్‌కే ఎన్నార్ గార్డెన్స్‌లో సశాస్త్రీయంగా, వైభవంగా వివాహక్రతువు నిర్వహించారు. ఈ నవదంపతులు నిష్కల్మషమైన ప్రేమభావనతో కలకాలం పచ్చగా జీవించి, సత్సంతానవంతులై, వారిని లోకకళ్యాణకారకులైన పౌరులుగా తీర్చిదిద్ది, ధన్యులు కావలసిందిగా పరమపూజ్య గురుదేవుల మంగళాశీస్సులు. అదే సాయివాణి శుభాకాంక్షను.

శ్రీ గువ్వల సోమన్నగారు, వారి శ్రీమతి లలిత ఆశ్రమానికి చిరకాల





మిత్రులు. మంచి దేశభక్తులు, విజ్ఞులు, అలుపెరుగని కార్యదీక్షాపరులూ అయిన సోమన్నగారు తమ కుమార్తె చి॥సౌ॥ చంద్రరేఖను ఆదోని వాస్తవ్యులు చి॥ శ్రీనివాసులుకు ఇచ్చి అంబర్‌పేట, హైదరాబాదులో-డిసెంబరు 26వ తేదీ ఉదయం గం.10.50 ని.లకు శాస్త్రోక్తవిధిన కళ్యాణక్రతువు నిర్వహించారు. నవవధూవరులు కలకాలం అన్యోన్యంగా జీవించి, లోకోపకారకులైన సత్సంతానంతో వర్ధిల్లాలనీ, చి.చంద్రరేఖ తన తల్లిదండ్రుల స్నేహశీలతకు, పరోపకారబుద్ధికీ వారసురాలై ఆ సంపద తన బిడ్డలక్కూడా అందించాలనీ పరమపూజ్య గురుదేవులు తమ ప్రేమాశీస్సులు అనుగ్రహిస్తున్నారు.

విజయలక్ష్మి బుక్ డిపో అధినేత శ్రీ వీరేశంగారు సాయిధామం అభిమాని. చిరకాలంగా బాబాతో అనుబంధం పెంచుకొన్న సహృదయులు. ఆయన, వారి శ్రీమతి విజయలక్ష్మిగారు తమ కుమార్తె చి.ల.సౌ. వాణికి చి.కృష్ణమూర్తికి (శ్రీమతి వీరమణి, శంకర్‌గార్ల పుత్రుడు) వైదిక వివాహరీతిలో-శ్రీ లక్ష్మీ గార్డెన్స్, కుషాయిగూడలో 2013, జనవరి 4వ తేదీ రాత్రి గం.9.15 ని.లకు కళ్యాణక్రతువు నిర్వహించారు. ఈ నవదంపతులకు చిరాయురారోగ్య ఐశ్వర్యాలు, సత్సంతానం శ్రీ సాయిబాబావారు ప్రసాదింతురుగాక!-అని పూజ్య గురుదేవులు ఆశీస్సులందిస్తున్నారు - తథాऽస్తు!

చి॥ వంగా కిరణ్‌కుమార్‌రెడ్డి సాయి విద్యాధామపు పూర్వ విద్యార్థి. పోతారం గ్రామవాసి. ప్రస్తుతం ఉన్నతోద్యోగంలో ఉన్నాడు. అతని తల్లిదండ్రులు శ్రీమతి, శ్రీ వంగా బుచ్చిరెడ్డి దంపతులు. అతని వివాహం చి.సౌ. శామిని (చిలుకూరి నరసింహారెడ్డి దంపతుల పుత్రిక)తో 2013 జనవరి 4వ తేదీ ఉదయం గం.10.42 ని.లకు శాస్త్రోక్తంగా వివాహక్రతువు నిర్వహించారు. ఈ నవదంపతులు నిరంతరం ఆనందంతో అవగాహనతో జీవించి, సత్సంతానాన్ని పొంది సఫల జీవనులగుదురు గాక!- అది సాయిధామం సభ్యులందరి ఆశీస్సులు.

# ఎవరనుకున్నావు

- చలం

నీకంత నేనకర్లేకపోతే నువ్వేనా, నా కంత కావాల్సింది! నాకూ ఉంది నా గర్వం తెలుసా?

'ఎక్కడికి పోతాడు, వెతుక్కుంటూ రాక!' అని కుదురుగా కూచున్నావులే!

చూద్దాంగా.

నేను నీకెంత అవసరమో నాకు తెలీదనుకుంటున్నావా? నువ్వు లేకపోతేనేం, నాకు నా ప్రపంచముంది. ఆకాశం, చెట్లు, నవ్వులు, కన్నీళ్ళు, ఉత్సవాలు, మరణాలు, అనురాగాలు, ద్వేషాలు, వెలుగునీడల ప్రపంచముంది నాకు.

అన్నీ వదులుకున్న నీకేముంది? ఇంక నేను నా ప్రేమా గాక ఇదిగో చూడు.

నా శక్తినంతా పోదులుకొని వచ్చాను నీ వేపు; ఇంక నా చాత కాదు, ఒక్క అడుగు కదలలేదు.

నా అశక్తత నీకు అర్థం కాదా? అర్థమయినా నిర్లక్ష్యమా! నా విషాదం, నీ మీది నా వియోగం, ఆ వియోగాన్ని కూడా ఉపయోగించుకోలేని నా అలసత నీకు పట్టదా?

అల్లాంటివాడివి నువ్వు మాత్రం నాకెందుకు? నీకూ శక్తి లేదా? నీకు చేతకాదా?

నిన్నూ నన్నూ మించిన విధి, నిన్నూ కట్టేస్తోందా?

ఇంతేనా నువ్వు?

ఎంత విశ్వసించాను- నా బలహీనాన్ని కాల్చగల బలం నీలో వుందని!

అంతా ఉత్తదేనా? నాకు జాలి వేస్తోంది నీ మీద.

మరి అంత గొప్పగా లోకాన్నంతా ఆవరించుకుని నాలోకి ఆకళించు కున్నట్లు చూస్తూ కూచుంటావే!

గోచీ దులిపేసుకుని, "నాకేం చాతకాదని" మాయం కాకూడదూ! మమ్మల్నిట్లా మోసం చెయ్యకుండా ఎంత నమ్మించావు!





'తెచ్చుకో, బలం తెచ్చుకో' అంటావు.

నా మొహం, ఇంకా బలం ఎక్కణ్ణించి తెచ్చుకోను? బలం! నాకే బలం వుంటే నువ్వెందుకు నాకు?

ఎవరి లెక్కా లేకుండా గొప్పగా కూచుందును, నీకన్నా ఇంకా నాలుగు దిళ్ళు ఎక్కువ వేసుకుని!

నాకు చేతకాకనే కదా, నీకోసం చేతిని జాచాను!

నాకు విసుగెత్తించకు, నా సామర్థ్యం నీకు తెలీదు, విరహాన్నే, భేదాన్నే, నా అల్పత్వాన్నే గట్టిగా కప్పకొని నిద్రపోగలను అనంతంగా!

"కుయ్యో, మొర్రో కరుణించు. ఇంక దిక్కులేదు" అని నా చేత అనిపించాలని చూస్తున్నావులే!

నరకంలో కాల్చు. పళ్ళు బిగపట్టి "ఇంకా ఏం బాధలున్నాయి, యాతన లున్నాయి నీ చేతుల్లో-తీసుకురా" అని ధిక్కరించగలను.

ఎవరనుకున్నావు?

ఇది చలం!

నీ కాఠిన్యానికి నీకు సిగ్గు తెప్పిస్తాడు.

'భగవాన్!" అంటాడు.

కపర్దే షిరిడీ డైరీ తెలుగు అనువాదం వెలువడింది. విడి ప్రతివెల రూ.75/- పది కాపీలు, ఆపైన ఆర్డరు చేసిన వారికి కొరియర్ ఖర్చులు ఉచితంగా పెట్టుకొని పంపుతారు. కావలసినవారు ఫోన్ మీద గానీ **(9440413455, 9848133565)**, ఉత్తరం ద్వారాగానీ సంప్రదించవచ్చును.

సాయిధామం ఆవిర్భావం, దాని గాథ అంతా రసరమ్యంగా వివరించిన గ్రంథం **"స్వామి తానై నడచి వచ్చిన సాయిధామం"**. దీని ఖరీదు రూ.51/-. ఇది కూడా 10 కాపీలు, ఆ పైన ఆర్డరు చేసిన వారికి కొరియర్ ఖర్చులు ఉచితంగా పెట్టుకొని పంపిస్తారు.

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

పరమహంస శ్రీరామకృష్ణుల వలన మహత్తర శక్తి పొంది సంపన్నురాలై, తన స్వయంసాధనతో దివ్యమాతృస్థాయికి చేరిన శారదామాత జీవితంలోని ఒక అద్భుత సంఘటన సేవలో ఉండవలసిన లోతును మనకు చెప్తుంది. ఒకనాడు ఆమె దర్శనానికి ఒక వృద్ధురాలు వచ్చింది. ఆమె జ్వరంతో (మలేరియా) బాధపడుతున్నది. శారదామాత ఆమెను ఆదరించి, భోజనం పెట్టి, తన గడపముందే పడుకోవడానికి చోటు చూపించారు. చాపా, పక్కబట్టలూ ఇచ్చారు. ఆ వృద్ధురాలు పడుకొన్న తరువాత మాత కూడా నిద్రబోయారు.

తెల్లవారుజామున మూడు గంటలకు శారదామాత నిద్రలేచి ఆ ముసలమ్మ ఎలా ఉందో చూద్దామని బయటకు వచ్చారు. ఆవిడ అనారోగ్యంతో ఉండటంతోను, వృద్ధాప్యంలో ఉంది గనుకనూ పాపం .... పక్కలోనే మూత్రవిసర్జన చేసేసుకున్నది. శారదమ్మ కాసేపాగి ఆమెను మెల్లగా లేపారు. ఇంట్లో మిగిలినవాళ్లు ఆమె అలా మూత్రం చెయ్యటం చూస్తే అసహ్యించుకొంటారో, కసురుకొంటారోననుకొన్నారామె.

అంచేత ఆమెను లేపి, కొద్దిగా అటుకులు, బెల్లం .... పొట్లం కట్టి యిచ్చి "అమ్మా ఇంకాస్సేపట్లో తెల్లవారుతుంది. నీవింక బయలుదేరి వెళ్లు. త్రోవలో ఎక్కడైనా ఫలహారం చెయ్యి" అని చెప్పి ఆమెను పంపించివేసారు. ఆమె





వెళ్లిపోగానే చాప, పక్కబట్టలు తీసి ఉతికి ఆరేసారు. వరండా అంతా కడిగారు.

ఇదంతా ఎందుకు చేసారు? ఇంట్లో వాళ్లు గ్రహించి ఆ ముసలామెను నిందిస్తారేమో! పైగా ఆమె పాడు చేసినవి ఇతరులు చేత ఉతికించటం వలన వాళ్లకేం యిబ్బంది కలుగుతుందో! అని ఆమె భావన. అంతేకాదు అందరూ "అమ్మ యిలా ఎందుకు చేసింది? ఏదో జరిగే ఉంటుంది" అనుకోకూడదని బయట ముంగిలి కూడా ఊడ్చి నీళ్లు చల్లేసారు. తాము చాలా మామూలు గృహకృత్యమే-కాస్త పెందలకాడ చేసినట్లు చూపించడానికి.

చూడండి. ఎవరో ఒక అనామక వృద్ధురాలి మనసు చిన్నబుచ్చకూడదనీ, ఇతరుల ముందు ఆమె నింద్యురాలు కాకూడదనీ ఆమె ఎంత దూరం ఆలోచించారో! ఈ ఉదాత్తత, సహజ కరుణ, సహానుభూతి ఉన్ననాడే సరైన సేవకులం కాగలం. అంచేత ఏదైనా సేవలో దిగేముందు ఆ స్థాయికి ఎలా ఎదగగలం? అని ఆలోచించాలి. ఆ సేవకు తగిన హృదయం కూడా పెంచుకోవాలి.

స్వామీ వివేకానంద పరివ్రాజకులుగా దేశమంతా పర్యటించి వచ్చారు. ఆ తరువాత ఆశ్రమంలో ఒకరోజు రాత్రి వారు వరండాలో తిరుగుతూ ఏడుస్తున్నారు. స్వామీజీ అంతటివారు ఏడవటం చూచి తోడుగా ఉన్న సాధువు గబగబ వచ్చి "ఏమైనా బాధగా ఉందా? ఎందుకేడుస్తున్నారు స్వామీ?" అని అడిగారు. అప్పుడు వివేకానందులు "మిత్రమా దేశ పరిస్థితులన్నీ గుర్తు వస్తే గుండె కరుగుతున్నదయ్యా! ఎంత పేదరికం, ఎంత అజ్ఞానం! దేశమాత దీనదశ నన్ను నిలవనివ్వటం లేదు సోదరా!"

అని యింకా ఏడ్చారు. అలా కరుణతో పొంగిన హృదయమే సేవను తన బాధ్యతగా స్వీకరిస్తుంది.

మా తండ్రిగారికీ, పొరుగువారికీ ఏదో వివాదం వచ్చింది ఒకప్పుడు. రాత్రి పది గంటల వరకూ పేచీ నడిచింది. అది మంచి వేసవికాలం. ఇళ్ల ముందు తాటాకుల పందిళ్లు వేసుకొని వేసవిలో వాటి క్రింద పడుకోవటం మా అలవాటు. సరే మావైపు మేము ముగ్గురు పిల్లలం, అమ్మా, నాన్నగారు పడుకొన్నాం. అదే పందిరి క్రింద ప్రక్కవాటా వాళ్లు రెండు మంచాల మీద తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పందిరి పోయినేడాదిది. అది తెల్లవారుజామున రెండు గంటల వేళ పెళపెళమని వాళ్లవైపు ఒక మూల విరిగి పడిపోసాగింది. నాన్నగారికి మెలకువ వచ్చింది కాబోలు - గభాల్న వెళ్లి ఆ పడిపోయే మూల రెండు చేతులతో ఎత్తి పట్టుకొని "భాస్కరరావ్, అబ్బాయ్, లేవండి - పందిరి పడిపోతోంది .... పిల్లల్ని తియ్యండి" అని గట్టిగా కేక లేసారు.

వాళ్లు లేని పిల్లల్నీ మంచాలనూ తీసేవరకూ నాన్నగారు పందిరి అలా పట్టుకొనే ఉన్నారు. ఈ లోపల మా మంచాలు కూడా తీసేసింది అమ్మ. నాన్నగారు పందిరి వదిలి అవతలికి గంతువేసారు. ప్రక్కవాళ్లవైపు పెళపెళా విరిగిపడిపోయింది సగానికి పందిరి. నాన్నగారు పట్టుకోకపోతే వాళ్లకు, పిల్లలకు దెబ్బలు బాగా తగిలేవి. పందిరి ఎత్తి పట్టుకోవటం వలన తాటాకు మట్ట గుచ్చుకుపోయి నాన్నగారికి గాయమైంది అరచేతిలో. అయినాగానీ ఆయన సమయానికి వాళ్లను కాపాడగలిగినందుకెంతో సంతోషించారు. అదీ బాధ్యతతో సేవారంగంలో దుమకటం అంటే. అది చేపట్టినవాడు అవతలి వాడెవరు, తనవాడా, పరవాడా .... ఏమీ ఆలోచించడు.

**(సశేషం)**





# ఒక యోగి ఆత్మకథలో...

**- శ్రీశ్రీ పరమహంస యోగానంద**

మాకున్న ఇరవయి ఎకరాల మంచి సారవంతమైన భూమిలో విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, నేనూ రోజూ కొంతసేపు చొప్పన తోటపని, ఆరుబయట ఇతర పనులు చేస్తూ ఆనందించేవాళ్లం. మాకు పెంపుడు జంతువులు చాలా ఉండేవి; ఒక లేడిపిల్లతో సహా. మా పిల్లలు దాన్ని ముద్దు చేశారు. నేను కూడా అదంటే ఎంత మనసుపడేవాణ్ణంటే, అది నా గదిలోనే పడుక్కోడానికి అనుమతించాను. తూరుపురేకలారే వేళ ఆ చిట్టిపాప, పొద్దుటి లాలింపు కోసం నా పక్క దగ్గరికి గునగునా నడుస్తూ వచ్చేది.

ఒకనాడు, ఏదో పని మీద రాంచీ ఊళ్ళోకి వెళ్లలసి వచ్చి, మామూలు వేళకంటే ముందే లేడిపిల్లకి పాలు పట్టాను. నేను మళ్లీ తిరిగి వచ్చేదాకా దానికి ఏమీ పట్టవద్దని కుర్రవాళ్లకి చెప్పాను. కాని ఒక కుర్రవాడు, నా మాట పట్టించుకోకుండా, దానికి బోలెడు పాలు పట్టేశాడు. సాయంత్రం నేను తిరిగి వచ్చేసరికి దుర్వార్త వినవచ్చింది. "పాలు ఎక్కువ పట్టడం వల్ల లేడిపిల్ల ప్రాణం పోయే స్థితిలో ఉంద"ని.

కళ్లలో నీళ్లు తిరుగుతూ ఉండగా, మృతప్రాయమై ఉన్న ఆ లేడిపిల్లని ఒళ్లో పెట్టుకుని, దాని ప్రాణం కాపాడమని దీనంగా దేవుణ్ణి ప్రార్థించాను. కొన్ని గంటల తర్వాత ఆ చిట్టి లేడి కళ్ళు విప్పింది. లేచి నిలుచుని నీరసంగా అడుగులు వేసింది. విద్యాలయమంతా ఆనందంతో పరవళ్ళు తొక్కింది. కానీ ఆనాటి రాత్రి గంభీరమైన గుణపాఠం ఒకటి తెలియవచ్చింది; నేనెన్నడూ మరచిపోలేనిదది - రాత్రి రెండు గంటల వరకు లేడిపిల్ల దగ్గరే మెలకువగా కూర్చున్నాను; ఆ తరువాత నిద్ర పట్టేసింది. లేడిపిల్ల కలలో

కనిపించి నాతో మాట్లాడింది. "నన్ను పట్టి ఉంచేస్తున్నారు; నన్ను పోనివ్వండి; నన్ను పోనివ్వండి!" అన్నది.

"సరే" అన్నాను కలలో.

వెంటనే మేలుకున్నాను; "ఏమర్రోయ్ పిల్లలూ, లేడి చచ్చిపోతోంది!" అని అరిచాను. పిల్లలు నా దగ్గరికి ఉరుక్కొచ్చారు. గదిలో నేను లేడిపిల్లను పడుకోబెట్టిన చోటికి పరుగెత్తాను. అది లేవడానికి చిట్టచివరి ప్రయత్నం ఒకటి చేసి, నా వేపు తూలి, ప్రాణం విడిచి నా కాళ్ళ దగ్గర కూలింది.

జంతువుల భవితవ్యాన్ని నడిపించి క్రమబద్ధం చేసే 'సమస్త కర్మ' ప్రకారం ఆ లేడి జీవితం అంతటితో ముగిసిపోయింది; ఉత్తమ జన్మకు పురోగమించడానికి అది సిద్ధంగా ఉంది. నా గాఢమైన అనుబంధం వల్లా (అది స్వార్థంతో కూడిందని తరువాత గ్రహించాను) ఎంతో శ్రద్ధగా చేసిన ప్రార్థనల వల్లా దాన్ని జంతురూప పరిమితుల్లోనే ఆపి ఉంచగలిగాను; కాని దాని ఆత్మ విడుదల కోసం పెనుగులాడుతోంది. ఆ లేడి ఆత్మ ప్రేమతో కూడిన నా అనుమతి లేకుండా పోనూ లేదు కనుక, కలలో నన్ను బ్రతిమాలుకుంది. నేను ఒప్పకోగానే వెళ్ళిపోయింది.

నాకు విచారమంతా తొలగిపోయింది. తన బిడ్డలు, సృష్టిలో ప్రతి దాన్నీ తనలోని ఒక భాగంగానే ఎంచి ప్రేమించాలనీ, చావు అన్నిటినీ అంతం చేస్తుందనీ, మాయలోపడి బాధపడకూడదని భగవంతుడు కోరతాడనీ నేను మరొకసారి గ్రహించాను. అజ్ఞాని అయిన మనుష్యుడు తన ప్రియమిత్రుల్ని శాశ్వతంగా మరుగుపరుస్తున్నట్టుగా బాహ్యదృష్టికి గోచరించే అలంఘ్యమయిన మరణకుడ్యాన్ని మాత్రమే దర్శిస్తాడు. కాని ఇతరులను ఈశ్వరుడి అభివ్యక్తులుగా ప్రేమించే నిస్సంగుడు, తన ప్రేమ పాత్రులు మరణించినప్పుడు వాళ్ళు క్షణకాలం తెప్పరిల్లడానికి వీలుగా ఈశ్వరానందం పొందడానికి మాత్రమే తిరిగి వెళ్ళారని అర్థం చేసుకుంటాడు.





# మాతృసంస్థ కబుర్లు

డిసెంబరు 9వ తేదీన కీసరగుట్ట పుణ్యక్షేత్రంలో, శివాలయ సాన్నిధ్యంలో కీసరగ్రామంలోని శివాజీ నగర్ వాస్తవ్యులైన యువజనులు తమ బృందాలతో కలిసి వనభోజనోత్సవాలు ఏర్పాటు చేసుకున్నారు. వారి ప్రార్థన మేరకు ఆ యువకులకు మార్గోపదేశం చేసి ఆశీస్సులు అందించడానికి పరమపూజ్య గురుదేవులు గుట్ట మీదికి వెళ్లారు. మూడు వందల మంది సమావేశమైన ఆ స్థలంలో దేశాభివృద్ధిలో యువకుల పాత్ర, వివేకానందుల స్ఫూర్తి, హైందవ జనత ధార్మిక రీతిలో నడవవలసిన విధానం మొదలైన విషయాలపై తమ మంగళప్రవచనం దయచేసి, కుర్రవాళ్లను ఆశీర్వదించి వచ్చారు.

డిసెంబరు 13వ తేదీ సాయంత్రం నాలుగున్నరకు సైనిక్‌పురిలోని భాస్కరరావునగర్‌లో ఉన్న శ్రీమతి మధుమణిగారింటిలో సత్సంగ సమావేశం జరిగింది. దాదాపు ఏడాదికాలంగా అవిచ్ఛిన్నంగా సాగుతున్న ఆ మహిళా సత్సంగానికి వారి ఆహ్వానంపై మాతాజీ అక్కడికి వెళ్లారు. విద్యావతులు, విశ్రాంత జీవనలు, కొంతలో కొంత ప్రశాంత జీవనాలు గడుపుతున్న వారూనైన ఇరవైమంది మహిళలు చిత్తశుద్ధితో ఆ సత్సంగం నడుపుకొంటున్నారు ప్రతి గురువారం. దానికి మాతాజీ "సౌమనస్య (సాయీ సత్సంగం") అని నామకరణం చేశారు. సత్సంగం విశిష్టత ఏమిటి, దాని వలని ప్రయోజనాలేమిటి? అన్న వాటిని గురించీ, ప్రతి వారం గత వారం రోజులలో తమలో వచ్చిన మార్పులేమిటని ఆలోచించవలసిన అవసరం గురించీ-చిన్న చిన్న ఉపమానాలతో, కథలతో వివరించి చెప్పారు. సభ్యులంతా అత్యంత శ్రద్ధాళువులై ఆలకించటం ముదావహం.

చివరిగా హారతిచ్చి ప్రసాదం పంచటంతో సత్సంగం పూర్తయింది. కన్యకగారు పట్టుదలగా దీని అభివృద్ధి కోసం కంకణం కట్టుకోవటం ఆనందప్రదమైన విశేషం.

16వ తేదీ రాత్రి ఆశ్రమానికి ఆడపడుచులా ఉండే శ్రీమతి ఇందిరగారి అమ్మాయి వివాహం. రవీంద్రారెడ్డిగారు, ఇందిర, చి॥ రూపాంజలి కూడా ఆహ్వానించి, అర్థించడంతో గురుదేవులు కూకట్‌పల్లి వెళ్లి అంగరంగ వైభవంగా జరిగిన రూపాంజలి, ఆదిత్య కృష్ణారెడ్డిగారల కళ్యాణం చూచి ఆశీరక్షతలు చల్లి వచ్చారు.

17వ తేదీ సోమవారంనాటి ఉదయం సాయిధామంలో (బాల) సాయి దీక్షలు ఇవ్వబడ్డాయి. అరవై మంది బాలబాలికలు ఎంతో ఉత్సాహంగా తెల్లని వస్త్రధారణతోను, నుదుట కుంకుమతోను, చిరునవ్వుల జల్లులతోను వచ్చి హోమగుండం చుట్టూ కూర్చున్నారు. మొదట శ్రీ రాంబాబుగారు దీక్ష అంటే ఏమిటో అది తీసుకొని తదేకంగా సాయి నామాన్ని పలుకుతుండటం, అందరూ కలిసి పూజలు చేసుకోవటం, పారాయణ చేయటం ద్వారా సాయి చరిత్ర మననం చేసుకోవటం, నగర సంకీర్తనలో సంకీర్తనం యిలా క్షణక్షణం సాయితో జీవిస్తూ పదకొండు, ఇరవై ఒకటి, నలభై రోజులు అలా గడపటం వలన బాబాతో మనకున్న అనుబంధం గట్టిపడుతుందని వివరించారు. తదుపరి శ్రీ గురుదేవులు సమంత్రకంగా దత్త హోమం చేయించారు. హోమానంతరం పిల్లలంతా అగ్నిప్రదక్షిణ చేసి నుదుట యజ్ఞభస్మం ధరించి, గురుదేవుల కరకమలాల ద్వారా మాలాధారణ చేసారు. మెడలో కాషాయ స్కార్ఫ్ (గళవస్త్రం), చేతికి సాయిబొమ్మ ఉన్న దారం కట్టుకొని ఒక మాల మంత్రజపం చేసుకున్నారు. తదనంతరం దీక్షా నియమాలను గూర్చి వివరించి చెప్పారు గురుదేవులు. బొమ్మలరామవరం, హాజీపూరు, పర్వతాపురం, ఖాజీపేట, మైలారం తండా,





తూముకుంట, కీసర మొదలైన గ్రామాల పిల్లలు ఆయా గ్రామాల దేవాలయాలలో సామూహిక పూజ, పారాయణ చేసుకుంటామనీ, కాఫీ, టీ వంటివి వదిలి పాలు, సాత్త్వికాహారం మాత్రమే తీసికొంటామనీ అన్నారు. నిందలు, కొట్లాటలు, తగువులు, అబద్ధాలు, సోమరితనం ఉండకూడదన్న గురుదేవుల మాటలకు వెంటనే స్పందించి అవన్నీ మానేస్తామన్నారు. తరువాత ప్రసాదాలు తీసికొని తమతమ పాఠశాలలకు వెళ్లిపోయారు.

డిసెంబరు 23వ తేదీన వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి)నాడు పరమాత్ముడు యోగనిద్ర వదిలి దేవతలకు, ఋషులకు దర్శనమిస్తాడనీ నమ్మకం. ఆ రోజున ఉత్తర ద్వార దర్శనం చేయటం మన జాతికి సంప్రదాయం. గత ఆరు నెలలుగా లోకకళ్యాణ చింతనలో యోగధ్యాన మగ్నుడైన స్వామి యీనాటినుండీ కార్యనిమగ్నుడవుతాడని వేదవిదులు చెప్తారు. (మనం యివ్వేళ చెప్పకొంటున్న కార్పొరేటెడ్ కంపెనీలన్నీ గొంతు చించుకొంటున్న ప్లానింగ్ అండ్ ఎగ్జిక్యూషన్ అన్న దానికి మూల పురుషుడు శ్రీమన్నారాయణుడే ననుకోవడంలో సందేహం లేదు.) గడచిన ఆరు నెలల కాలం వానలతో, మళ్లీ బురదతేరి వాతావరణం ప్రసన్నం కావటంతో సరి పోతుంది. తీవ్ర కార్యాచరణకు ఆ సమయం అంతగా పనికిరాదు. కనుక ఆ ఆరునెలలూ యోగస్థితిలో ఉండి (మన సాధు సన్యాసులు చేసే చాతుర్మాస్య దీక్ష కూడా యిలాంటిదే గదా!) తిరిగి వాతావరణం వేడెక్కే కొద్దీ చేతనావంతమవుతుంది కార్యదక్షత. దాన్నే యిలా చెప్పి ఉంటారు పెద్దలు. వేకువజామున నాలుగు గంటల నుండే యీ ఉత్తర ద్వారదర్శనం ప్రారంభమవుతుంది. సత్తెనపల్లి కోదండరామసాయి సన్నిధానంలో యీ ఉత్సవం చాలా పెద్దఎత్తున జరుగుతుంటుంది. అందుచేత గురుదేవులు, చంద్రారెడ్డి, రాము, శ్రీనివాస్, నరేశ్, బ్రహ్మారెడ్డిలతో కలిసి 22వ తేదీ ఉదయం బయలుదేరి సత్తెనపల్లి వెళ్లారు.

ఉత్సవ విగ్రహాలకు పులికాపు పెట్టడాలు, రానున్న భక్తుల కోసం ఏర్పాట్లు,

స్థానిక భక్తుల రాకపోకలతో రాత్రి గడిచింది. అక్కడి కార్యనిర్వాహకులు శ్రీ కంచర్ల రామయ్యగారు, గోపీకృష్ణ, రామకోటేశ్వరరావు, ఇక్కడి నుండీ వెళ్లిన కార్యకర్తలు అందరికీ తెల్లవారుజామున నాలుగు గంటల నుండీ చేతినిండా పని. దేవాలయంలోని మూలవిరాట్ కోదండరామయ్య, సీతాలక్ష్మణుల విగ్రహాలు సాలంకృతంగా కళలుచిందాయి. ఉత్సవవిగ్రహాలు ఉత్తర ద్వారం దగ్గర కొలువుదీరాయి. ఇక భక్తసందోహం రాసాగింది. ఉత్తర ద్వారదర్శనం, పూజ, మళ్లీ తూర్పు ద్వారం గుండా మూలవిరాట్ దర్శనం, అటుపైన గురుదర్శనం, హనుమద్దర్శనం - ఒక్కొక్క భక్తుడూ అలా వెడుతూ వెడుతూ పన్నెండయ్యేటప్పటికి దాదాపు మూడు వేల మంది దర్శనం చేసుకున్నారు. అందరికీ ప్రసాదాలు అందించటం, క్యూలో పంపటం, తెలిసిన వారిని పలకరించటం వగైరాలతో కార్యకర్తలంతా అలసి పోయారు. మధ్యాహ్నం కాగానే భక్తుల రాక పల్చబడింది. తరువాత భోజ నాదికాలు పూర్తి చేసుకొని గురుదేవుల బృందం తిరుగుప్రయాణం ప్రారంభించింది. త్రోవలో మిరియాలగూడలోని ఈశ్వరమ్మగారి ఆశ్రమం దగ్గర ఆగారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా అక్కడి సాయి దేవాలయంలో వ్రతం జరిగింది. పాతికమంది భక్తులు గురుదర్శనం కోసం వేచిఉన్నారు వీరు వెళ్లే సమయానికి. గురుదేవులు వారినుద్దేశించి ఆనాటి తిథి ప్రత్యేకత, పవిత్రత, సాయిశక్తి మొదలైన వాటిని గూర్చి వివరించి చెప్పి, ఆశీస్సులిచ్చి, ఈశ్వరమ్మగారి ఆతిథ్యం స్వీకరించి, చివరికి రాత్రి ఎనిమిదిన్నరకు సాయిధామం చేరుకున్నారు.

సాయిధామంలోని శ్రీ సాయి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనం, పల్లకీ సేవ జరిగాయి. 23 వేకువనే శ్రీ గోవిందరావు (బాల) సాయిదీక్షా పరులు, చిట్టి, ఉపాధ్యాయులు, ఆశ్రమవాసులు-అందరూ కలిసి పల్లకీ మోసారు. మామూలుగా జరిగే పూజల తరువాత పదకొండు గంటలకు గీతా మాతకు అష్టోత్తర శతనామావళితో పూజ జరిగింది. శ్రీ కృష్ణాష్టోత్తర





శతనామ పూజ కూడా పూర్తయ్యాక-మాతాజీ భగవద్గీత జననం - యుద్ధ రంగం మానవజీవితానికి ప్రతీక కావటం - నరనారాయణులు మన లోపలి దైవాంశకూ, మానవాంశకూ ప్రతీకలు కావటం- జీవన సంఘర్షణ ఏర్పడినప్పడు నారాయణబోధే నరుడిని నడపటం, గీత సార్వజనీనం, సార్వకాలికం కావటం మొదలైన విషయాల గురించి చెప్తూ, నాలుగు యోగాల గూర్చీ, అందులో కర్మయోగ విశిష్టతను గూర్చీ వివరించారు. గాంధీజీకి సహనాన్నీ, స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొని ఉరికంబాలెక్కిన వారికి సాహసాన్నీ కూడా గీతే ప్రసాదించిందనీ, ఉరికంబాలపైకి వెళ్లి ఉరి తాళ్లను ముద్దాడి మరీ ప్రాణాలు విడువగల త్యాగశక్తి గీతా ప్రసాదమే ననీ చెప్పారు. తదుపరి శ్రీ సాయికి మహాహారతితో భక్తులంతా వెళ్లిపోయారు. ఆదివారం ఏకాదశి- రెండూ శక్తి సంపన్నమైన రోజులే. అలాంటిది వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి ఆదివారంనాడు రావటం యింకా ప్రశస్తం. అటువంటి పరమపర్వదినాన-హిందువులై పుట్టినవారే కొందరు జంతువధ చేసి వండుకు తినటం - అది కూడా ప్రపంచమంత టికీ తల్లి అయిన అమ్మ వారి ముందు - మైసమ్మ గుడి ముందు-చాలా బాధాకరమైన విషయం. ఈ పద్ధతి మారేదెన్నడో!

ఆ రోజు శ్రీ సాయినాథ క్షేత్రంలో కూడా ఉత్తరద్వార దర్శనం, విశేష పూజలు జరిగాయి. శ్రీ సాయి ఊరేగింపు, తదుపరి భజన జరిపారు. డిసెంబరు 26, 27 తేదీలలో బాలదీక్షాధారులంతా తమతమ గ్రామాలలో భిక్షాటన చేసి, ఆ వచ్చిన బియ్యం, డబ్బు మొదలైన వాటిని ఆయా గ్రామాలలోని (ఒక వితంతు-సంతానహీన వృద్ధురాలు, ఇద్దరు మతిలేని పిల్లలున్న కూలి మనిషి, ఇల్లూ వాకిలీ లేని భిక్షగత్తె-యిలా) నిరుపేదలకు పంచిపెట్టారు. సాయిధామం పిల్లలు కూడా వృద్ధాశ్రమం, టీచర్స్ క్వార్టర్స్, ఉష- అన్ని భవనాలూ తిరిగి భిక్షాటన చేసారు. వచ్చిన వాటిని ఎవరికివ్వాలి? ఇదో సమస్య అయింది వాళ్లకు. ఆశ్రమం అంతటిలో పేద

వారెవరు? చర్చ తేలలేదు. మాతాజీ చెప్పారు. “నాటికీ, నేటికీ ఆ చినిగిన కఫినీ తప్ప మరో గుడ్డ లేదు మన పెద్దాయనకు. ఆయనకన్నా పేదవారెవ రుంటార్రా? బాబాగారి హుండిలో వేసెయ్యండి”-అని. ముఖముఖాలు చూచుకొన్నారు ముందు. తరువాత మాతాజీ “బాబా పేరిట చేసిన భిక్ష యిది అంచేత-అయితే ఆయనకు, లేకపోతే అతి నిరుపేదకు దక్కాలి. ఇక్కడ అలాటివారెవరూ అందుబాటులో లేరు గనుక....” అంటూండగానే పరుగునవెళ్లి భిక్షలోని డబ్బు హుండీలో వేసి, పండ్లు ఆయన పాదాల దగ్గర పెట్టి వచ్చేసారు.

డిసెంబరు 28వ తేదీ దత్త పూర్ణిమ. ఉదయం పూజల తరువాత తలలపై ‘బాబా చరిత్ర’ గ్రంథాలు కట్టి పూజించిన పోతీలుంచుకొని, సాయి నామంతో భజనలు చేస్తూ-చావడిలో ఏర్పాటు చేయబడిన హోమ గుండం దగ్గరకు చేరుకున్నారు. బాలదీక్షాదారులందరూ. అక్కడ శ్రీ సాయి పటం ముందు దీపాలు వెలిగించారు మాతాజీ. ఓంకారంతో నామోచ్చారణ చేసారు పిల్లలందరూ. తరువాత దీక్ష తీసుకోవటం వలన కలిగే ప్రయోజనాలేమిటో మరోసారి సోదాహరణంగా గుర్తు చేసాక-“యీ దీక్షలో మీరు నేర్చుకొన్నదేమిటి? మీరు వదిలిపెట్టబోతున్న (మీ) అవగుణం ఏమిటి? ఒక్కొక్కరూ చెప్పండి” అని అడిగారు మాతాజీ. అబద్ధాలు మానేస్తాం-దొంగ తనం చెయ్యం-ఏ జీవినీ హింసించం-పొగరుబోతుతనం తగ్గించు కొంటాం-పెద్దలకు ఎదురుతిరగం-బద్ధకం వదిలిపెడతాం-ఏదైనా సాటి వారికి పెట్టిగానీ తినం”-యిలా తలొక్కటీ చెప్పారు. అందరిలోనూ రాంబాబు అనే కుర్రవాడు (6వ తరగతి, కీసర స్వగ్రామం) “నేను ఏ జీవినీ బాధపెట్టను. అంతేకాక నేను నేర్చుకున్న విషయాలు, గురువుగారు చెప్పేవి-అన్నీ కూడా మా ఊళ్లో అందరికీ చెప్తాను” అని చెప్పి ఓ చిట్టి సత్సంగానికి బీజం వేసుకున్నాడు. గురుదేవులు చాలా సంతోషించారు.

తరువాత దత్తహోమం చేసారు శ్రీ వేంకటేశ్వర్లుగారు - రాంబాబుల





ఆధ్వర్యంలో. చివరిలో పిల్లలందరూ, కొందరు పెద్దలు, అతిథులు కూడా హోమగుండం చుట్టూ ప్రదక్షిణ చేసి హోమద్రవ్యం అగ్నికి సమర్పించు కొన్నారు. తదుపరి పూర్ణాహుతి జరిగింది. దత్త పూర్ణిమ గనుక గురుదేవులు దత్తాత్రేయుని గురించి చిన్నగా వివరించారు. అటుపైన పిల్లలందరిచేత మాలలు తీయించి, దీక్షావస్త్రంలో మడిచిపెట్టించి, తమ దీక్ష నిర్విఘ్నంగా పూర్తి చేయించినందుకు బాబాకు కృతజ్ఞతా ప్రార్థన చేయించారు గురుదేవులు. తరువాత పిల్లలంతా గురుదేవుల ఆశీస్సులు తీసుకొని ప్రసాద స్వీకారం చేసి తమ తమ ఊళ్లకు వెళ్లిపోయారు. అప్పటికి పదకొండు గంటలైంది. ప్రతి పూర్ణిమనాడూ చేసే శ్రీ సాయినాథ వ్రతం ప్రారంభమై హారతి వేళకు పూర్తి అయింది. వ్రత ప్రసాద వినియోగం తరువాత ఆశ్రమ బాలబాలికలు కూడా వచ్చేసి, మామూలు కార్యకలాపాల్లో పడ్డారు. దీనితో పదకొండు రోజుల నుండీ వేకవనే వినిపించిన నగర సంకీర్తనకూ, చాలీసాలకూ, భజనలకూ, ఏకభుక్తాలకూ, హడావుడికీ, ఫుల్‌స్టాప్ పడింది. దీక్ష మాక్కూడా, మాక్కూడా అని కేకలు పెట్టి ఏడ్చి మరీ దీక్ష తీసుకున్న చైత్ర, సుధీర, వెంకట్‌ల ఉత్సాహం మెచ్చదగిందే మరి!

శ్రీ సాయినాథ క్షేత్రంలో దత్త జయంతినాడు శ్రీ సాయీశ్వరునికి, దత్త దేవునికి పంచామృతాభిషేకాలు, గజమాలాలంకరణలు, విశేషపూజలు కన్నులపండువుగా జరిగాయని అక్కడి సాయి దేవాలయం ‘సర్వతోభద్ర’ పూజారి శ్రీ సాయిరమణ తెలియజేస్తున్నారు.

జనవరి 1 భారతీయులకు నూతన సంవత్సరం కాదు. కానీ, ఆంగ్ల కేలండర్‌నే అనుసరించి కాలమానాన్ని లెక్కకట్టడానికి అలవాటు పడిపోయాం గనుక జనమంతా ఉగాదిని మర్చిపోయి దీన్నే సంవత్సరాదిగా భావిస్తున్నారు. అందుచేత జనవరి 1వ తేదీన సాయి దర్శనానికి పదిహేను వందల మందికి పైగా భక్తులు వచ్చారు.

# మేఘశ్యామ్-ఆధ్యాత్మికత స్థాయి

- మాతాజీ

శ్రీ సాయి సచ్చరిత్రలో మనకు కనిపించే విశిష్ట పాత్రల్లో మేఘశ్యాముని పాత్ర ఒకటి. అతడు భక్తిపరుడైన బ్రాహ్మణుడు. హరి వినాయక సాఠేగారి దగ్గర వంటవాడిగా ఉండేవాడు. నిత్య శివపూజ చేసే అలవాటు ఆయనకు. నిరక్షరాస్యుడు కావటం చేత విధి విధానాలు సరిగా తెలిసేవి కావు. అతని పట్ల ఉన్న అభిమానంతో సాఠే అతనికి మంత్రమిచ్చి సంధ్యావందనాదికాలు నేర్పారు. షిరిడీ వెళ్ళి సాయిబాబా దర్శనం చేసుకొమ్మని చెప్పారు. కానీ, త్రోవలో ఎవరో సాయిబాబా మహమ్మదీయ ఫకీరని చెప్పటంతో అతను చికాకుపడి "బాబా శివావతారమని మీరు చెప్తున్నారు గానీ - ఆయన ముస్లిమని విన్నాను. నన్నక్కడికి పంపకండి" అని సాఠేను వేడుకున్నాడు. ఈ అమాయక భక్తునికి మేలు కలిగి తీరాలన్న పట్టుదలతో సాఠే తన మామగారైన దాదా కేల్కర్ ద్వారా మేఘాను బాబాకు పరిచయం చేయించే ప్రయత్నం చేసాడు. ఇక తప్పదనుకొని మేఘశ్యాముడు షిరిడీ వచ్చి దర్శనార్థం మసీదుకు వెళ్లాడు. బాబా అతన్ని చూస్తూనే "నీవు గొప్ప జాతి బ్రాహ్మణుడివి-నేను తక్కువ జాతి మహమ్మదీయుడినీను. నా దగ్గరకు వస్తే నీ కులంపోతుంది-పోఫో" అని కసిరికొట్టారు. తన మనసులోని సంకోచం బాబా గ్రహించినందుకు మేఘా ఆశ్చర్యచకితుడైనాడు. వారం రోజులపాటు అక్కడే ఉండి బాబాను సేవించుకొని, తిరిగి వెళ్లిపోయాడు.

అటుపైన ఏడాదిన్నరపాటు నాసికాత్ర్యంబకంలో ఉండి శివార్చన చేసుకున్నాడు. కానీ, ఏదో అసంతృప్తి! తిరిగి షిరిడీ వచ్చాడు. దాదాకేల్కర్ సహాయంతో అతను షిరిడీలో నివాసం ఉండి, మసీదులో సాయికి నిత్య సేవ చేసుకోగలిగాడు. బాబా క్రమంగా మేఘశ్యామ్‌లో చిన్న చిన్న మార్పులు తీసుకురావటం ప్రారంభించారు. గ్రామంలో ఉన్న దేవాలయాలన్నింటినీ





సందర్శించుకొని, అటుపైన సాయిబాబా దగ్గరకు (మసీదుకు) వచ్చి పూజ చేసుకొనేవాడు మేఘశ్యామ్. ఒకరోజు ఆయన వెళ్లిన సమయానికి ఖండోబా మందిరం తెరిచిలేకపోవటంతో పూజ చేసుకోకుండానే మసీదుకు వచ్చాడు. బాబా ఆయన్ని లోపలికి రానివ్వకుండా "ఇప్పడు తలుపు తెరిచారు-వెళ్లి ఖండోబాను చూచిరా!" అని పంపారు.

ప్రతిరోజూ మైళ్లకొద్దీ దూరం నడిచివెళ్లి మారేడుదళాలు తెచ్చేవాడు మేఘశ్యామ్. శివప్రీతికరమైన బిల్వపత్రంతో సాయిని అర్చించి సంతృప్తుడయ్యేవాడు. క్రమక్రమంగా సాయే పరమేశ్వరుడన్న భావన అతనిలో బలపడిపోయింది. ఒకనాడు ఎనిమిది క్రోసులు నడిచి గోదావరికి వెళ్లి నీళ్లు తెచ్చి సాయినాథునికి అభిషేకం చెయ్యాలనుకొన్నాడు. ఆనాడు సంక్రాంతి పర్వదినం. బాబా "నా తల మాత్రం తడుపుగానీ ఒంటి మీద పొయ్యకు" అన్నారు. సరేనన్నాడు మేఘశ్యామ్. తీరా నీళ్లు తెచ్చాక ఆ పారవశ్యంలో ఆ మాట మరచిపోయాడు. "హర గంగే హర గంగే" అని నామోచ్చరణ చేస్తూ నీళ్లు బాబా వారి తల మీద పోసాడు బిందెతో. ఆ పోసిన తీరుకు నిలువెల్లా తడవాలి బాబా. కానీ చిత్రంగా వారి తల మాత్రమే తడిసింది. ఈ బాబా లీల మేఘునిలో యింకా భక్తిని పాదుకొల్పింది.

అతడు తన నివాసంలో కూడా బాబా చిత్రపటం నిలుపుకొని, దానిని కూడా పూజిస్తూ ఉండేవాడు. అలా నిత్యం, నిరంతరాయంగా ఏడాదిపాటు మేఘశ్యాముడు సాయిసేవ చేసాడు. ఒకరోజు తెల్లవారుజామున అతడు మంచం మీద పడుకొనే సాయి ధ్యానం చేసుకుంటున్నాడు. బాబా అతని మనోనేత్రం ముందు నిలబడి, కొద్దిగా అక్షతలు అతనిపై చల్లి, "మేఘా, శివుడు రాబోతున్నాడు. గోడ మీద త్రిశూలం గియ్యి" అని చెప్పి మాయమై పోయారు. మెలకువ వచ్చి కళ్లు తెరిచి చూచిన మేఘాకు అక్షతలు కన్పించి ఆశ్చర్యపోయాడు. కానీ, తలుపులు మూసిన గదిలోకి బాబా ఎలా వస్తారన్న సందేహం అతనికి కలిగింది. వెంటనే బాబా దగ్గరకు వెళ్లి, జరిగిన వృత్తాంతమంతా వివరించాడు. ఆయన నవ్వి "నేను రావడానికి

తలుపులూ, గోడలు అడ్డమా! త్రిశూలం గియ్యి" అన్నారు. మేఘశ్యాముడు వెళ్లి జేగురురంగుతో గోడ మీద త్రిశూలం గీసాడు. మరునాడే ఒక భక్తుడు శివలింగం తెచ్చి బాబాకు సమర్పించాడు. బాబా అది మేఘునికిచ్చి, "చూచావా, శివుడు వచ్చాడు" అన్నారు. మహదానందం చెందాడు మేఘశ్యామ్. తన యిష్టదైవం బాబా తన కులదైవం శివుడిని తనకు అందించారు. ధన్యమైంది తన జన్మ-అని మురిసిపోయాడు. అటుపైన అనేక సంవత్సరాలు బాబాను సేవించుకొన్న తరువాత బాబా సన్నిధానం లోనే (షిరిడీలోనే) తనువు చాలించాడు మేఘశ్యామ్. ఆయన మరణించిన రోజు బాబా ఎంతగా బాధపడ్డారో, అతని శవాన్ని తీసుకు వెడుతుంటే ఎలా కన్నీరు పెట్టుకున్నారో కపర్దే తన డైరీలో కూడా వ్రాసుకున్నారు. "ఇతడు నా నిజమైన భక్తుడు" అన్నారు బాబా మేఘశ్యామ్ శవాన్ని తన చేతులతో నిమురుతూ అని హేమాడ్పంతు వ్రాసారు. మేఘుని పేరిట అన్నదానం కూడా చేసారు సాయిబాబా.

సాయినాథుల వారి దగ్గరకు ఎందరెందరో భక్తులు వస్తూ పోతూ ఉండేవారు. బాబా వారితో ప్రేమతో మాట్లాడినట్లున్నాగానీ, మానసికంగా ఎంతో నిర్లిప్తంగా ఉండేవారు. అలాంటివారు మేఘశ్యామ్ విషయంలో ఎందుకంత ఆప్తత ప్రదర్శించారు? ప్రతిరోజూ తనకు మసీదులో హారతిచ్చే వారనా? ఎందరో అలా హారతులిచ్చారు-స్తోత్రాలు చేసారు-గీతాలు వ్రాసారు-నిలువెత్తు మాలలు వేసారు-పల్లకీలు, గుర్రాలు ఏర్పాటు చేసారు. మరి వారందరి పట్లా బాబా యిలా ప్రవర్తించి, కన్నీళ్లు పెట్టుకొనేంత అభిమానం చూపించలేదే! మరి మేఘశ్యామ్ వంటి నిరక్షరకుక్షీ, నిర్ధనుడూ అయిన అమాయక భక్తునిలో బాబాకు కన్పించిన విశిష్టత ఏమిటి? చూద్దాం.

మేఘశ్యామ్ మొదట సాయిబాబాను ఒక ముస్లిం ఫకీరుగా మాత్రమే చూచాడు. తాను బ్రాహ్మణుడై ఉండి తురక వానిని సేవించడమేమిటను కొన్నాడు. బాబా తన మనసులో మాట గ్రహించారన్న గ్రహణ కలగగానే





కొంత గౌరవం ఏర్పడింది. కానీ, అది స్థిరం కాలేదు. అందుకే నాసికాత్ర్యం బకం వెళ్లిపోయాడు. కానీ బాబా కరుణ వలన అతని లోపల చెలరేగే ఆర్తి అతన్ని అక్కడ నిలవనివ్వలేదు. తిరిగి వచ్చాడు. అటుపైన బాబా ఉప దేశాలతో అతనిలో వచ్చిన మార్పు క్రమక్రమంగా గాఢమైంది. తన ఆరాధ్య దైవమైన శివునికిష్టమైన మారేడు దళాలతో పూజలు, అభిషేకాలు సాయిబాబాకే చేయసాగాడు. అంటే సాయిబాబాలో ఆ నామానికీ, రూపానికీ అతీతమైన దైవీశక్తి యొక్క పరిపూర్ణతను అతడు గ్రహించటం ప్రారంభించాడు. "విశ్వాంతరాళంలోని ప్రతి జీవిలోనూ దైవతేజమే పర్యాప్తమై ఉంటుంది. చీమ మొదలు బ్రహ్మ వరకూ ఆయన తేజమే నడిపిస్తుంది. అందుచేత ఒక కుక్కలోనైనాసరే - దీని పేరు కుక్క, దీని రూపం ఫలానా అనే దృష్టిని విడిచి దానిలోపల వెలిగే పరంజ్యోతిని చూడగలిగితే సర్వజీవులూ ఒకటిగానే కన్పిస్తాయి. నీలో ఉన్న ఆత్మే అందరి లోనూ ఉన్నదన్న ఎఱుక (జ్ఞానం) కలుగుతుంది. దానినే ఆత్మ సాక్షాత్కారం అంటారు. అంతేగానీ ఆత్మ అనేది ఒక పదార్థం కాదు - నీ కళ్ల ముందు సాక్షాత్కారించడానికి. అదొక అనుభూతి, అన్ని జీవులలోనూ ఒకేసారి దివ్యాత్మను దర్శించే శక్తి. అందుచేత మొదట మనం శ్రేష్ఠునిగా తలచే గురువును నామరూపాతీతుడైన భగవానునిగా భావించి, ప్రేమించి, ఆరాధించడం నేర్చుకొంటే క్రమక్రమంగా అది విస్తరించి సర్వజీవులలోనూ భగవదాత్మనే చూడగల శక్తి కలుగుతుంది. అందుకే గురువే దైవం అనుకొమ్మని చెప్పారు పెద్దలు" అని వివరిస్తారు అస్మదీయ గురుదేవులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీ. ఆ విధంగానే మేఘశ్యాముడు సాయిని నామరూపాతీతుడైన దైవంగా భావించి, ఆ భావనలోనే లయించి, సాయితో "త్వమేవాఽహం" అన్నంతగా పెనవేసుకుపోయింది మేఘశ్యామ్ హృదయం.

మొదట దేవతలందరినీ సమభావనతో సేవించటం నేర్పారు బాబా. తరువాత అతనికి ప్రీతిపాత్రమైన శివలింగం అతని దగ్గరకు వచ్చేలా చేసి

దానిని తన పటం ముందే ప్రతిష్ఠించేలా చేసి, తానే పరమశివుడన్న పారమ్యాన్ని సూచించారు. ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ మేఘశ్యామ్ ఆయన బోధించిన స్థాయికి చేరుకొనేటప్పటికి - బాబా హృదయం కరుణ రసాప్లావితమైంది.

మేఘశ్యాముడు లౌకిక విద్యలు నేర్చినవాడు కాదు. మంత్రతంత్రాలు తెలిసినవాడూ కాదు. అందుచేత బాబా శక్తిని పరిపూర్ణంగా గ్రహించడానికి మనలాగా తర్కాలూ, మీమాంసలూ అడ్డు రాలేదాయనకు. అలాంటి నిష్కపట భక్తుడు గనుకనే బాబా ఆయన మరణానికి చలించిపోయారు. శవాన్ని తాకి మరీ జన్మ ముక్తుడిని చేసే ఉంటారు. అలా ధన్యుడైనాడు మేఘశ్యాముడు. మనకెప్పుడో ఆ ధన్యత!

బాలవాణి

# నసీరుద్దీన్ కొడుకు

నసీరుద్దీన్ తెలివితేటలకీ, సమయస్ఫూర్తికీ, హాస్యరసం చిందించే చక్కని సంభాషణాచాతుర్యానికీ పేరు పొందినవాడు. ఆయనంటే సుల్తాన్ (ప్రభువు)కు కూడా ఎంతో గౌరవం. నసీరుద్దీన్‌కు ఒక కొడుకున్నాడు. వాడికి ఎనిమిదేళ్ళుంటాయి. తండ్రిని మించిన చమత్కారి వాడు.

ఓ రోజు నసీరుద్దీన్ కొడుకును వెంటబెట్టుకొని రాజవీధిలో నడుస్తున్నాడు. సుల్తాను అదే సమయంలో గుర్రమెక్కి నగర పర్యటన చేస్తున్నాడు. నసీరుద్దీన్ ఆయనకు ఎదురయ్యాడు. సుల్తాన్ గుర్రం ఆపి, తనకు సలాం చేస్తున్న అతనితో "ఏమయ్యా నసీరుద్దీన్ క్షేమమా? వీడెవడు- నీ కొడుకా? నీలా తెలివిగలవాడు కాడనుకొంటానే! మొద్దులాగా కన్పిస్తున్నాడు!" అన్నాడు సుల్తాన్. నసీరుద్దీన్ కొడుక్కి ఆ మాటలు వింటోంటే ఒళ్లు మండిపోయింది. రాజమర్యాదలు తెలిసిన నసీరుద్దీన్ మాత్రం మళ్లీ సలాం చేసి "అంతా అల్లా దయ జహాఁపనా!" అన్నాడు. 'అంతేలే' అంటూ





సుల్తాన్ తన జేబులో నుంచీ ఒక రాగి దమ్మిడీ తీసి, "ఇదుగోరా అబ్బాయ్ చక్రవర్తి నీకు కానుక ఇస్తున్నాడు తీసుకో!" అని చెయ్యి చాపాడు.

'నాకేమీ అవసరం లేదు' అన్నాడు పిల్లవాడు కాస్త దురుసుగా. "ఏయ్! అలా అనకూడదురా! ప్రభువుల బహుమానం తిరస్కరిస్తే తల తెగి పడుతుంది" అన్నాడు నసీరుద్దీన్. "తల తీయించినా సరే-నేనా దమ్మిడీ తీసుకోను" అన్నాడు పిల్లవాడు. "నా చేతిలోంచీ వచ్చే గడ్డి పరకైనా సరే అనంత ఐశ్వర్యమనుకుంటారు ప్రజలు. తెలుసా?" సుల్తాన్ కోపంగా అన్నాడు. "తెలుసు జహాఁపనా!" అన్నాడు బుడంకాయగాడు. మరి, తెలిసే ధిక్కరిస్తున్నావా?" అన్నాడు సుల్తాన్ రవ్వంత విస్మయంగా. "మహాప్రభూ! ఏదో చిన్నవాడు తెలియక .... " అని సర్ది చెప్పబోయాడు నసీరుద్దీన్. కానీ బుడతడు ఊరుకోలేదు. "నాన్నా! నేనేం చిన్నవాడిని కాదు. నాకు తెలియకా కాదు - ప్రభువుల మీది గౌరవంతోనే నేను ఆ కానుక తీసుకోనంటున్నాను" అన్నాడు వాడు. "అదేమిటి?" ఆశ్చర్యంతో అడిగాడు తండ్రి. "కాస్త ఆలోచిస్తే నీకే తెలుస్తుంది నాన్నా! వారేమో గొప్ప సుల్తాన్ వారు, ఇంత పెద్ద రాజ్యానికి అధిపతులు. అంత గొప్పవారు ఇంత అల్పమైన కానుక యిచ్చారని ఎవరికైనా తెలిస్తే ప్రభులవారికెంత అప్రతిష్ఠ! దానం దాత స్థాయిలో ఉండాలి కదా! ఈ రాగిదమ్మిడీని ప్రభువుల వారి కానుకగా నేను ఎవరికైనా ఎలా చూపించుకోమంటావు!" అన్నాడు పిల్లవాడు. ఒక్క క్షణం తెల్లబోయిన సుల్తాన్ మరుక్షణంలో "ఓహ్హొహ్హో ...." అంటూ విరగ బడి నవ్వాడు. "సెభాష్ రా బేటా! నువ్వు నీ తండ్రిని మించిన మాటకారివీ, తెలివిగలవాడివీరా!" అని అభినందించి, చేతికి పట్టినన్ని బంగారు నాణేలు తీసి పిల్లవాడి చేతిలో పోసి భుజం తట్టాడు సుల్తాన్. నసీరుద్దీన్, కొడుకూ కూడా వినయంగా సలాములు చేస్తూ సాగిపోయారు.

*(దమ్మిడీ : ఆ రోజుల్లో ఓ చిన్న ... అతి చిన్న నాణెం-దానికి కూడా కొంత విలువ ఉండేది.)*



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

08-12-1910

ఉదయం ప్రార్థన తరువాత సాయి మహరాజ్ బయటికి వెళుతుండగా బాబా దర్శనమైంది. అటుపైన సాయంత్రం మసీదుకు వెళ్లాంగానీ, ఆయన కాళ్లు కడుక్కొంటూ ఉండటం చేత వెనక్కి వచ్చాము. సహస్రబుద్ధే, నేనూ, మరో పెద్దమనిషీ (ఇవ్వేళ ప్రొద్దున్నే వచ్చాడితడు) కలిసి వెళ్లి తిరిగి వచ్చాము. తాత్యాసాహెబ్ నూల్కర్ మాతో రాలేదు. తరువాత మళ్లీ వెళ్లాంగానీ సాయి తొందరగా పంపేశారు. అప్పుడు సాయి చాలా కోపంగా ఉన్నారు. ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు. ఆ రాత్రి సాయి చావడి ఉత్సవాన్ని చూచాము. అది చాలా బావుంది. ఇందాక నేను చెప్పిన క్రొత్త వ్యక్తి పోలీసు ఆఫీసరు. ఆయన హెడ్ కాని స్టేబులనుకుంటా. అతని మీద లంచగొండితనం ఆరోపించబడి, సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. అతడు తాను ఆ కేసు నుండీ బయటపడితే బాబా దర్శనానికి వస్తానని మొక్కు కున్నాడు. ఇప్పుడా మొక్కు తీర్చుకోవడానికి వచ్చాడు. అతన్ని చూస్తూనే సాయి “ఇంకొన్నాళ్లు అక్కడే ఉండవలసింది. పాపం వాళ్లు నిరాశపడ్డారు'' అన్నారు. ఈ మాటలు ఆయన రెండు సార్లన్నారు.





తరువాత తెలిసింది-ఆ పెద్దమనిషి మిత్రులు అతన్ని ఆగమని బ్రతిమాలారుగానీ యితను వినలేదని. అతడు అంతకుముందెప్పుడూ సాయిని చూడలేదు. సాయి కూడా అతన్ని చూచి ఉండరు. అలాంటప్పుడు అతనేం చేసిందీ సాయికి ఎలా తెలిసింది? అన్నదే ఆశ్చర్యం.

09-12-1910

నేనూ, మా అబ్బాయీ ఇవ్వేళ వెళ్లిపోదామనుకున్నాము. ఉదయం ప్రార్థన తరువాత సాయిని చూడటానికి వెళ్లాము. ఆయన మా అబ్బాయిని చూచి “వెళ్లాలనుకొంటున్నావా?'' అని అడిగి, సరే వెళ్లమన్నారు. మేము అవసరమైన అనుమతి లభించిందనుకొని ప్రయాణానికి సిద్ధమయ్యాము. అబ్బాయి బాబా సామాన్లన్నీ సర్ది, ఒక మంచి బండి, మరో బండి సామాను మొయ్యడానికి మాట్లాడారు. సాయంత్రం ఒక్క మాటు చూచి వెడదామని మసీదుకు వెళ్లాం బయలుదేరబోతూ. నన్ను చూడగానే సాయి “నీవు నిజంగా వెళ్లి తీరాలనుకొంటున్నావా?'' అన్నారు. “వెళ్లాలనుకొంటున్నాను గానీ - మీరు అనుమతిస్తేనే!'' అన్నాన్నేను. “అలా అయితే రేపో, ఎల్లుండో వెళ్లవచ్చులే. ఇది మన ఇల్లు. వాడా మన యిల్లు. నేనిక్కడుండగా ఎవరైనా ఎందుకు భయపడాలి? ఇది మన యిల్లు. దీన్ని నీ యిల్లేనని నీవు భావించాలి'' - అన్నారు సాయి. నేనందుకు ఒప్పుకొని ప్రయాణ సన్నాహాలన్నీ రద్దు చేసేసాను. మాట్లాడుకొంటూ కూర్చున్నాం. సాయి మహరాజు చాలా ప్రసన్నంగా ఉన్నారు. ఆయన అనేక విషయాలు చాలా చక్కనివి చెప్పారుగానీ నేను పూర్తిగా అర్థం చేసుకోలేదనుకొంటా.

**(సశేషం)**